క్లుప్తంగా

'మానవత' సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: షుగర్ వ్యాధి కారణంగా కాలికి తీవ్ర గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన గంటా రాంబాబుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.7500 ఆర్థిక సాయం అందించింది. గత కొంతకాలంగా మధుమేహం వ్యాధితో బాధపడుతున్న రాంబాబుకు ఇటీవల పురుగు కుట్టడంతో మోకాలు వద్ద పెద్ద గాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రాంబాబుకు వైద్య ఖర్చుల నిమిత్తం మానవత రూ.7500 ఆర్థికసాయాన్ని శుక్రవారం అందించింది. మానవత కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, అధ్యక్షుడు కూరెళ్ల సుబ్బాచారి, ప్రధాన కార్యదర్శి క్లోపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు వేగిరెడ్డి సూర్యనారాయణ, వడ్డీ రాజేశ్వరావు, జన్యావుల సత్యనారాయణ, దయాల ప్రభాకరరావు పాల్గొన్నారు.

15 నుంచి ఉచిత శిక్షణ

ఉంగుటూరు: ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈ నెల 15వ తేదీ నుంచి మొబైల్ ఫోన్ రిపేర్, హోటల్ మేనేజ్‌మెంట్, నర్సింగ్, ఐటీ బేసిక్స్ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని డైరెక్టర్ పరదేశి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18–35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులని చెప్పారు. శిక్షణ పొందేవారికి ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణానంతరం సర్టిఫికెట్లు ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగలవారు 9347897922 నంబరుకు ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తిపై దాడి

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు కరకట్ట ప్రాంతానికి చెందిన రావిళ్ల నాగయ్య పాల వ్యాపారం చేస్తాడు. అతను గురువారం శివాలయం సమీపంలో బడ్డీ కొట్టు వద్ద ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన వంశీ అనే వ్యక్తి పాత గొడవల కారణంగా కూల్ డ్రింక్ బాటిల్‌తో దాడి చేశారు. ఈ దాడిలో నాగయ్య తలకు గాయమైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వీఏఏలు పంటలను పరిశీలించాలి

పొలాల్లోకి వెళ్లి రైతులకు సూచనలు ఇవ్వాలి

నున్న(విజయవాడరూరల్): సచివాలయాల్లోని వ్యవసాయ సహాయక సిబ్బంది పంట పొలాలను సందర్శించి రైతులకు చీడపీడల నివారణకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం నున్న గ్రామ రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ నాగిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై తగిన సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు ఇవ్వాలన్నారు. జెడ్పీటీసీ కె.సువర్ణరాజు మాట్లాడుతూ రబీ సీజన్లో నీటి సమస్య గురించి సంబంధిత అధికారులతో చర్చిస్తామన్నారు. విజయవాడ ఏడీఏ బి. వెంకటేశ్వరావు మాట్లాడుతూ రబీ సీజన్ ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్ మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో రైతుల అవసరాలకు తగిన విధంగా ఎరువుల నిల్వలున్నాయన్నారు. సమావేశంలో నున్న సొసైటీ చైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి, సలహా మండలి సభ్యులు, రైతులు, పశుసంవర్ధకశాఖ అధికారి, ఏఎస్ఓ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమం
- రోగులకు వైద్య పరీక్షలు
- ఉచితంగా మందుల పంపిణీ
- కమిషనర్ వెంకటేశ్వరరావు



పోరంకిలో ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద ప్రజల సంక్షేమం, ప్రజారోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజలందరికీ మెరుగైన, నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టారని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. వీరవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.కిరణ్మయి నేతృత్వంలోని వైద్యుల బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆహార పద్ధతులు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. 572 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ బి.రామారావు వైద్య శిబిరాన్ని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు.

గన్నవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలందరికీ వరం అని వీరపనేనిగూడెం సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ చెప్పారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామస్తులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఉన్నత వైద్యం కావాల్సిన వారిని రిఫరల్ ఆస్పత్రులకు పంపారు. 504 మందికి వైద్యాధికారి డాక్టర్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య సేవలు అందజేశారు. ఉప సర్పంచ్ బండి నాగసాంబిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాపూజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

పెనమలూరు: జగనన్న ఆరోగ్య వైద్య శిబిరంలో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. పోరంకి-2 సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. 300 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా, వారికి మందులు పంపిణీ చేశారు. వైద్య, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను ప్రభుత్వం అందజేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు అన్నారు. నున్న గ్రామ సచివాలయ-1 పరిధిలోని వెల్‌నెస్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష-2 ఉచిత వైద్యశిబిరం జరిగింది. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ, డాక్టర్ అనిత, డాక్టర్ సూర్యనారాయణ వైద్య పరీక్షలు నిర్వహించారు. పోలారెడ్డి చంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బొంతు సరోజిని, గిరిజా కుమారి, కార్యదర్శి జీటీవీ రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. 437 మందికి వైద్యం అందించారు.

వెట్టి చాకిరీ సమాచారం ఇవ్వండి



జడ్జి శ్రీనివాసబాబును సత్కరిస్తున్న విద్యార్థులు



కోలవెన్నులో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి పి.రాజారాం

న్యాయమూర్తులు

గన్నవరం: ఎక్కడైనా వెట్టి చాకిరీకి గురవుతున్న వారిని గుర్తిస్తే రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి డాక్టర్ సీహెచ్. శ్రీనివాసబాబు పిలుపునిచ్చారు. వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించేందుకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. మండలంలోని దావాజిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ..సమాజంలో అనేక మంది వెట్టి చాకిరీకి గురవుతున్నారని చెప్పారు. వీరికి విముక్తి కల్పించేందుకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్య పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందన్నారు. రామకృష్ణ పరమహంస, అబ్దుల్ కలాం వంటి మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని చెప్పారు. అనంతరం జడ్జి శ్రీనివాసబాబును విద్యార్థులు సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య, ఎంఈఓ కె.రవి కుమార్, ఎస్ఐ శివప్రసాద్, లేబర్ ఆఫీసర్ కిషోర్ కుమార్, ఈవోపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నసీరున్నీసా, హెచ్ఎం వి.రజని తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఉయ్యూరు: లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉయ్యూరు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి కె.శ్రీహరి కోరారు. స్థానిక న్యాయస్థానంలో శుక్రవారం బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులతో నాయమూర్తి కె.శ్రీహరి సమావేశం నిర్వహించారు. మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. న్యాయమూర్తి శ్రీహరి మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు. కక్షిదారుల్లో అవగాహన కల్పించి రాజీ మార్గంగా కేసులు పరిష్కరించుకునేలా బాధ్యతలు తీసుకోవాలని శ్రీహరి సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపిచంద్, ప్రతినిధులు సూర్యనారాయణ, హరీష్, మాదల ప్రసాద్, శ్రీరామ్ పాల్గొన్నారు.

కంకిపాడు: వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని నాలుగవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.రాజారాం అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోలవెన్ను పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి పి.రాజారాం మాట్లాడుతూ చాలా మంది చిన్నారులు వెట్టిచాకిరీలో మగ్గిపోతున్నారన్నారు. బాలల అక్రమ రవాణాను అడ్డుకోవటం ద్వారా వెట్టి చాకిరీని నియంత్రించొచ్చు అన్నారు. చిన్నారులపై జరిగే అఘాయిత్యాలకు కఠినమైన శిక్షలు అమలులో ఉన్నాయన్నారు. సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, ఉపసర్పంచ్ కంచర్ల చిన్ని, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు జేజమ్మ, రాము, కె.శివయ్య, ప్రభావతి, సిహెచ్ సుబ్బారావు, ఎస్ఐ తాతాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగులను నివారిస్తే ఆరోగ్యం

జిల్లా మలేరియా అధికారి రామారావు



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న జిల్లా మలేరియా అధికారి రామారావు, ప్రజాప్రతినిధులు



గంగూరులో విద్యార్థులకు మాత్రలు అందజేస్తున్న డాక్టర్ బిజిలీ శ్రీనివాస్

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆరోగ్యకరమైన పిల్లల కోసం ఏటా తప్పనిసరిగా నులిపురుగుల నివారణకు మాత్రలను వేసుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ బి.రామారావు చెప్పారు. స్థానిక నూజివీడురోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నారయ్య, సీహెచ్‌వో ఎస్.ఫణికుమార్, హెచ్ఎంతోట వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెనమలూరు: నులిపురుగుల నివారణకు మందు బిళ్లలు వాడి ఆరోగ్యంగా ఉండాలని మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు పాఠశాలల్లో వైద్య సిబ్బంది నులి పురుగుల నివారణకు మందు బిళ్లలు పంపిణీ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ మండల పరిధిలో 1–19 సంవత్సరాల వయస్సున్న వారు 56,934 మంది ఉన్నారన్నారు. వీరికి ప్రభుత్వం ఆల్‌బెండాజోల్ 400 ఎంజీ మందు బిళ్లలు ఉచితంగా పంపిణీ చేపట్టిందన్నారు. గంగూరులో విద్యార్థులకు మందు బిళ్లలను పంపిణీ చేశారు.

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జెడ్పీహైస్కూళ్లలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ బి.మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాత్రలు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎ.నాగమల్లేశ్వరరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి, హైస్కూల్ హెచ్ఎం జి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 848 మందికి మాత్రలు అందజేశారు.

విజయవాడ రూరల్: మండలంలోని వెలగలేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 49,435 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను వేసినట్టు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధురి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, ప్రభుత్వ, ప్రైవేటు, ఎలిమెంటరీ స్కూల్స్, హైస్కూల్స్ విద్యార్థులతో పాటు, ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు మొత్తం 50, 550 మంది ఉండగా, వారిలో 49,435 మంది విద్యార్థులకు వైద్య సిబ్బంది మాత్రలను వేసినట్టు మెడికల్ ఆఫీసర్ తెలిపారు.

ఉయ్యూరు: మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. బొళ్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, కాటూరు జెడ్పీ పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యులు హిమామహేశ్వరి, ఎస్.శివరామకృష్ణ, హెచ్ఎం రమాదేవి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఉయ్యూరు మున్సిపాలిటీలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది మాత్రలు పంపిణీ చేశారు.

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ అనగాని రవి మాత్రలు పంపిణీ చేశారు. ఎంఈవో కే.రవి కుమార్,హెచ్ఎం ఝాన్సీరాణి పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన..

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రుతుక్రమంలో పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గైనకాలజీ హెడ్ డాక్టర్ సజన, రెడ్‌క్రాస్ గన్నవరం శాఖ చైర్మన్ చిన్ని మాధవి, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఎం.విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ



పేదలకు పత్రాలను అందజేస్తున్న తోట, ఎంపీపీ, పార్టీ నేతలు

గన్నవరం: అసైన్డ్ భూములు దశబ్దాలుగా సాగు చేసుకుంటున్న పేదలకు శాశ్వత భూహక్కు కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం సూరంపల్లి శివారు రామచంద్రపురానికి చెందిన 30 మంది అసైన్డ్ భూముల సాగుదారులకు శాశ్వత భూహక్కు పత్రాలను ఎంపీపీ అనగాని రవి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 45 ఎకరాల అసైన్డ్ భూములను గత 70 ఏళ్లుగా పేదలు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం 2015లో ఈ భూములను సెక్షన్ 22ఏ కింద చేర్చడంతో రిజిస్ట్రేషన్లకు అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 20 ఏళ్లకుపైగా అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు శాశ్వత భూహక్కు కల్పిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. దీంతో వీరి సమస్యను ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులతో మాట్లాడి అసైన్డ్ భూముల సాగుదారులకు శాశ్వత భూహక్కు పత్రాలను మంజూరు చేయించినట్లు తెలిపారు. తమకు అసైన్డ్ భూములపై శాశ్వత హక్కు కల్పించిన సీఎం వైఎస్. జగన్, ఎమ్మెల్యే వంశీకి పేదలు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, వింత శంకరరెడ్డి, మాజీ అధ్యక్షుడు పడమట సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు తుల్లిమిల్లి ఏడుకొండలు, సర్నాల రాంబాబు, పార్టీ నాయకులు పామర్తి మాధవరావు, బండి వెంకటేశ్వరరావు, కే కోటి, కాజ సుబ్బారావు, కోటగిరి సుబ్బారాయనం, సర్నాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

సంక్షిప్తం

• ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన

ఉంగుటూరు: ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు అన్నారు. నారయ్య అప్పారావు పేటలో ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాల వలన కలిగే అనర్థాలను వివరించారు. షాపుల వద్ద డస్ట్ బిన్‌ను ఏర్పాటు చేసుకోవాలని, చెత్తను రోడ్ల వెంబడి వేయకూడదని, చెత్తను మురుగు కాలువలో వేయవద్దని తెలిపారు. గ్రామ సర్పంచ్ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

• మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కంకిపాడు: మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను దుర్భరం చేసుకోవద్దని నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ కె.ప్రియాంక అన్నారు. విజయవాడ నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో కంకిపాడు జెడ్పీ పాఠశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. జోనల్ కోఆర్డినేటర్ ఎస్.జాకబ్ రాజు, హెచ్ఎం జీబీకే సుధారాణి, బాలభవన్ ప్రతినిధి జ్యోతి చంద్రిక, ఉపాధ్యాయులు ఎంజె.రాజు, డి.భాగ్య లక్ష్మి, యు.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

• ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

ఉయ్యూరు: రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొల్లపూడి వేణుబాబు కోరారు. మండలంలోని గండిగుంట ఆర్‌బీకేలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు.వేణు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుకు మద్దతు ధర ఇచ్చే ఉద్దేశంతో ధాన్యం సేకరిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావటం లేదన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయకపోవటంతో సమస్య తలెత్తుతుందన్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించి రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఓ గణేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

• సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం

కంకిపాడు: మౌలిక వసతుల కల్పనతో గ్రామాల్లో ప్రగతి పోటుచేసుకుంటుందని వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్ అన్నారు. కంకిపాడు రెల్లి కాలనీలో గ్రామ పంచాయతీ నిధులు రూ.2.80 లక్షలు అంచనా వ్యయంతో చేపట్టిన సిమెంటు రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. కృష్ణకిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మరియబాబు, స్థానికులు వడ్డాది శ్రీనివాసరావు, గాదంశెట్టి పరమేశ్వరరావు, దలియా శంకర్, తదితరులు పాల్గొన్నారు.

• నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలోని రాయ్‌నగర్ ఫీడర్‌లో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు తెలిపారు. రాయ్‌నగర్ ఫీడర్‌లోని ఎస్సీ ఏరియా, ఉపాధ్యాయనగర్, చర్చి రోడ్డు, రీచ్ రోడ్డు, రాయ్‌నగర్, రామ్‌నగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఏరియా, తహసీల్దారు ఆఫీస్ ఏరియా, గాంధీబొమ్మ సెంటర్, బుద్ధవరం రోడ్డు గౌడపేట, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, వీనస్ బజార్ ప్రాంతాల్లో పైన తెలిపిన సమయంలో విద్యుత్ ఉండదని చెప్పారు.

ఉయ్యూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఉయ్యూరు రూరల్ ఈఈ కృష్ణనాయక్ తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గంగూరు నుంచి నందమూరు వరకూ 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిర్వహణ శనివారం చేపట్టనున్నామన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పెద ఓగిరాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెద ఓగిరాల, చిన ఓగిరాల, ఆకునూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

• రగ్బీ జాతీయ పోటీలకు ఎంపిక

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని వివేకానంద ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఆర్.మురళీవిజయ్ నేషనల్ లెవల్ రగ్బీ సబ్ జూనియర్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బొప్పన హరికృష్ణ శుక్రవారం మాట్లాడుతూ ఈనెల 2, 3 తేదీల్లో విశాఖ భీమిలిలో జరిగిన స్టేట్ లెవల్ రగ్బీ పోటీల్లో మురళీ విజయ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి నేషనల్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 13, 14, 15 తేదీలలో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే ఈ పోటీల్లో పాల్గొంటాడని వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహులనాయుడు, గురవయ్య, ఎస్ దేవీ, ఉపాధ్యాయులు మురళీ విజయ్‌కు అభినందనలు తెలిపారు.

• మామిడి తోటల పరిశీలన

గన్నవరం రూరల్: కొండపావులూరు గ్రామంలో మామిడి తోటలను ఉద్యాన అధికారి ఇ.హరిచంద్ శుక్రవారం పరిశీలించారు. తామర పురుగుల ఉధృతి నివారణకు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఉధృతి ఎక్కువగా ఉంటే వేపనూనె 1500 పీపీఎం 3ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. హార్టీకల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

• తాగునీటి బోరు పనులు ప్రారంభం

పెనమలూరు: గంగూరు గ్రామం సచివాలయం–2 పరిధిలోని ఏఆర్‌నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి శుక్రవారం బోరు పనును ప్రారంభించారు. ఈ ప్రాంతంలో తాగునీటి సమస్య ఉండటంతో స్థానికులు గురువారం ఆందోళన చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న మంత్రి జోగి రమేష్ ఘటనా స్థలానికి వచ్చి గ్రామస్తులతో మాట్లాడారు. తాగునీటి సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్తులు మంత్రి జోగి రమేష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి వెంటనే స్పందించి మండల అధికారులతో మాట్లాడారు. బోరు నిర్మాణంతో పాటు ట్యాంకుకు పైప్‌లైన్ వేయటానికి రూ.6 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో బోరు పనులు అధికారులు శుక్రవారం ప్రారంభించారు. బోరు పనులు ముగిసిన తరువాత పైప్‌లైన్ నిర్మాణం చేసి తాగునీరు నేరుగా వాటర్ ట్యాంకులో నింపుతారు. మంత్రి స్పందించిన తరువాత వెంటనే బోరు పనులు ప్రారంభించి తాగునీటి సమస్య పరిష్కారం చేయటానికి మార్గం సుగమం చేయటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

• సాఫ్ట్‌వేర్ రంగంలో మార్పులను అందిపుచ్చుకోవాలి

పెనమలూరు: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో సాఫ్ట్‌వేర్ రంగంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ నిపుణుడు అశ్రుదేవ్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో వారం రోజులుగా జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆయన ప్రసంగించారు. అధ్యాపకులు సాఫ్ట్‌వేర్ రంగంలో వస్తున్న అనూహ్య మార్పులను అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఇంధన, పారిశ్రామిక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించుకోవటం వలన సరైన మూలాలు తెలుసుకోవచ్చని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మెరుగైన బోధన చేయాలని సూచించారు. కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

• నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కంకిపాడు: మండలంలోని కోలవెన్ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 11 గంటలకు డాక్టర్ వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కోలవెన్ను, కుందేరు, కందలంపాడు, నెప్పల్లి, గొల్లగూడెం, పునాదిపాడు, దావులూరు, చలివేంద్రపాలెం, జగన్నాధపురం గ్రామాలకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు డాక్టర్ వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు విజ్ఞప్తి చేశారు.

• పేదరిక నిర్మూలనకు 'లయన్స్' సేవలు

ఉయ్యూరు: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా లయన్స్‌క్లబ్ పని చేస్తుందని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జెఎస్ శంకర్‌గుప్తా అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో శుక్రవారం పేద కుటుంబాలకు వస్తువులు అందించారు. సుధీర్ టింబర్ డిపో కాన్ఫరెన్స్ హాలులో శంకర్ గుప్తా మాట్లాడుతూ సమాజ అభ్యున్నతే లక్ష్యంగా లయన్స్ కార్యక్రమాలు చేస్తుందన్నారు. పేదలకు అవసరమైన సేవలు అందిస్తూ లయన్స్‌క్లబ్ లక్ష్యాల దిశగా ముందుకు సాగుతున్న ఉయ్యూరు ప్రతినిధులను అభినందించారు. ప్రతినిధులు నూకల వెంకట సాంబశివరావు, ఎండీ ఇస్మాయిల్, వేమూరి సత్యనారాయణ, రామకృష్ణ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.